క్లుప్తంగా

భార్యపై హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): అనుమానంతో భార్యపై హత్యాయత్నం చేసిన ఘటనలో నిందితుడిపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. హరనాథపురంలోని నాగసాయి మందిర ప్రాంతానికి చెందిన రత్నకు ముత్తుకూరు గేట్‌కు చెందిన హజరత్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. టైల్స్ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్న హజరత్ కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకొని ఆమెను శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు గురిచేయసాగాడు. పలుమార్లు హత్యాయత్నం చేశాడు. అతని వేధింపులను తాళలేక ఇటీవల ఆమె పుట్టింటికెళ్లారు. ఈ నేపథ్యంలో భార్య వద్దకు గురువారం ఆయన వెళ్లారు. ఆమె గొంతుకు చున్నీని బిగించి చంపేందుకు యత్నించగా, తప్పించుకొని పెద్దగా కేకలేయడంతో కుటుంబసభ్యులు, స్థానికులు రావడంతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై హత్యాయత్నం, వేధింపుల కేసును నమోదు చేశారు.

బైక్‌కు నిప్పు

నెల్లూరు(క్రైమ్): బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించిన ఘటన మూలాపేటలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. పెద్ద చెరుకూరుకు చెందిన ఖాజామొహిద్దీన్ కొంతకాలంగా మూలాపేటలో నివాసం ఉంటున్నారు. తన హీరో స్ప్లెండర్ బైక్‌ను ఇంటి ముందు శుక్రవారం రాత్రి నిలిపారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పంటించడంతో వాహనం దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి సెల్‌ఫోన్ అపహరణ

నెల్లూరు(క్రైమ్): నగదు కోసం వ్యక్తిని కత్తితో బెదిరించి.. అది లేకపోవడంతో సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లిన ఘటన వైఎంసీఏ గ్రౌండ్స్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంట లేఅవుట్లోని ఓ భవన నిర్మాణం వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న శివాజీ ఏసీ కూరగాయల మార్కెట్‌కు వచ్చారు. కూరగాయలను కొనుగోలు చేసిన అనంతరం మూత్ర విసర్జనకు వైఎంసీఏ గ్రౌండ్స్ సమీపంలోకి వెళ్లారు. ఆయనకు తెలిసిన మహేంద్ర తనకు నగదు ఇవ్వాలని.. లేని పక్షంలో అంతుచూస్తానంటూ కత్తితో బెదిరించారు. దీంతో తన వద్ద నగదు లేదని.. సెల్‌ఫోన్ ఉందని చెప్పడంతో దాన్ని లాక్కెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిన్నబజార్ ఎస్సై హనీఫ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేడు

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ విద్యార్థులు హాజరుకావాలని కోరారు.


రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల అసోసియేషన్ సమావేశాన్ని భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల భవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనర్ల సమస్యలపై జిల్లా ట్రెజరీ కార్యాలయ అసిస్టెంట్ ట్రెజరీ అధికారి లోకేష్‌బాబు అవగాహన కల్పించనున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్లు, తదితరులు హాజరుకావాలని కోరారు.

రైతులను ఆదుకోవాలని వినతి

నెల్లూరు (వేదాయపాళెం): అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోటిరెడ్డి కోరారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో అఖిల పక్ష రైతు సంఘ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘ జిల్లా కన్వీనర్ షానవాజ్, కాంగ్రెస్ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, సీపీఐ జిల్లా సమితి సభ్యులు నాగేంద్ర, రమణయ్య, వెంకటేశ్వర్లు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



నెల్లూరు(పొగతోట): పంచాయతీల్లో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ, డీపీఓ చిరంజీవి ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలో డీఎల్పీఓలు, ఈఓపీఆర్డీలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం పూర్తికానున్న నేపథ్యంలో ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌ను వంద శాతం వసూలు చేయాలని చెప్పారు. పంచాయతీల్లో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వామిత్వకు సంబంధించి సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డ్వామా పీడీ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల్లో గుబులు



బుచ్చిరెడ్డిపాళెం: కాగుళ్లపాడు వద్ద ముంబయి జాతీయ రహదారిపై ఆరబోసిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా పట్టలతో కప్పిన దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: అకాల వర్షం అన్నదాతల్లో గుబులు రేపుతోంది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆకాశం మేఘావృతమై మండలంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు పడడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట కోత దశలో ఉంది. వర్షం కొనసాగితే చేతికంది వచ్చిన పంట నేలవాలి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ముందుగా నాట్లు వేసిన రైతులు కోతలు చేపట్టి ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసుకుని ఉన్నారు. అకాల వర్షంతో ఆరబోసుకున్న ధాన్యాన్ని పట్టలతో కాపాడుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజులు వర్షం కురిస్తే రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని వారు వాపోతున్నారు.

పొదలకూరు : మండలంలో శనివారం చిరుజల్లులు పడ్డాయి. ఉపరితల ఆవర్తన ప్రభావంతో కొద్దిసేపు ఎండ కాస్తూ..మరికొద్ది సేపు ఆకాశం మేఘావృతమై స్వల్పంగా వర్షం కురిసింది. అకాల వర్షంతో వరి కోతలకు సిద్ధమవుతున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మరో వారం రోజుల్లో వరి కోతలు చేపట్టనున్నారు. మరో రెండ్రోజులు వర్ష సూచన ఉండడంతో భారీ వర్షం పడితే పంట నేలవాలి నష్టపోతామని రైతులు దిగాలు చెందుతున్నారు.

వరికోతలకు బ్రేక్

వెంకటాచలం: మండలంలో మూడ్రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజుల నుంచి మండలంలోని కంటేపల్లి, గొలగమూడి, కాకుటూరు, కనుపూరు, కురిచెర్లపాడు, తదితర గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. మూడ్రోజుల నుంచి నిత్యం ఏదోక సమయంలో వర్షం కురుస్తుండటంతో కోసిన ధాన్యం ఎక్కడ తడిచిపోతుందోనని రైతులు వరికోతలు నిలిపివేశారు. భారీ వర్షం కురిస్తే చేతికొచ్చిన పంట నేలపాలవుతుందని రైతులు దిగాలు చెందుతున్నారు.

కోవూరులో భారీ వర్షం

కోవూరు: ఉపరితల ఆవర్తన ప్రభావంతో కోవూరులో శనివారం అకాల వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల సమయంలో దాదాపు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో వరికోతలకు బ్రేక్ పడింది. వర్షం కొనసాగిస్తే చేతికొచ్చిన వరి పంట నేలవాలి నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కోవూరులో జోరుగా కురుస్తున్న వర్షం



గొలగమూడిలో వరికోతకు సిద్ధంగా వరి పంట



బుచ్చిరెడ్డిపాళెంలో జోరుగా కురుస్తున్న వర్షం

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



రూ.5లక్షల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: పడుగుపాడు పంచాయతీ చంద్రమౌళినగర్ గిరిజన కాలనీకి చెందిన వలంటీర్ కొమరగిరి అఖిల మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆ సమయంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన వంతు సాయంగా అఖిల పిల్లలకు రూ.50వేలు నగదు అందజేసి అండగా నిలిచారు. సీఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అఖిల కుటుంబ పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.5లక్షల చెక్కు మంజూరు చేశారు. ఈ చెక్కును అఖిల భర్తకు నెల్లూరులోని తన నివాసంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి రుణపడి ఉంటామని అఖిల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, వైఎస్సార్సీపీ మండలాధ్యక్షుడు నలుబోలు సుబ్బారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, పడుగుపాడు ఉపసర్పంచ్ ఎస్కే అహ్మద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



శీనమ్మకు నగదు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని మునులపూడికి చెందిన తలకాయల సురేష్ కుటుంబానికి సర్పంచ్ పత్తి వెంకటరమణారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలిసి శనివారం రూ.32వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన సురేష్ మృతి చెందగా, ఆయన భార్య శీనమ్మకు సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు కలిసి రూ.32వేలు సాయం అందజేసినట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమణమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విస్తారంగా పత్తి సాగు

- గతేడాది కన్నా తగ్గిన ధరలు




పొదలకూరు : గతేడాది ఊహించని రీతిలో పత్తి ధరలు పలికాయి. ఎన్నడూ లేని విధంగా కిలో రూ.100కుపైగా పలకడంతో పత్తి పంట వేసిన రైతులు లాభాలను పొందారు. దీంతో ఈ ఏడాది మండలంలోని రైతులు వరిసాగును తగ్గించి పత్తి పంట విస్తారంగా సాగుచేశారు. గతేడాది 1000 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 1500 ఎకరాల్లో సాగు చేపట్టారు. దీంతో దిగుబడులు పెరిగి డిమాండ్ తగ్గింది. గతేడాది మార్చిలో కిలో పత్తి రూ.100 పలకగా, ప్రస్తుతం మార్కెట్లో రూ.63 ధర పలుకుతోంది. దీంతో పత్తి రైతులు ధరలు పెరుగుతాయని ఆశిస్తున్నారు.

ఆయుధ వినియోగంలో మెళకువలు అవసరం

నెల్లూరు(క్రైమ్): ఆమంచర్లలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో ఎస్పీ విజయారావు, పోలీస్ అధికారులు ఫైరింగ్ సాధన చేశారు. పోలీస్ వృత్తిలో ఫైరింగ్ నైపుణ్యం కీలకమని, అధునాతన ఆయుధ వినియోగంలో మెళకువలను నేర్చుకోవాలని సిబ్బందికి సూచించారు.

జీజీహెచ్ ఏడీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు (అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఏడుకొండలు బాధ్యతలను శనివారం స్వీకరించారు. విజయవాడలోని డైరెక్టరేట్‌లో ఏటీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పెద్దాస్పత్రిలో రోగులకు మంచి సౌకర్యాలు కల్పించి.. పారిశుధ్య, ఇతర కాంట్రాక్ట్ సిబ్బందికి సకాలంలో జీతాలు వచ్చేలా చర్యలు చేపడతామని చెప్పారు.

గృహ నిర్మాణాల పరిశీలన



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి సీహెచ్ ఉషారాణి

వెంకటాచలం: మండలంలోని ఇడిమేపల్లి, ఈదగాలి, ఎర్రగుంట గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారిణి సీహెచ్ ఉషారాణి శనివారం పరిశీలించారు. హౌసింగ్ డే సందర్భంగా గృహ లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం నాణ్యమైన మెటీరియల్ సరఫరా చేయడంతో పాటు సత్వరమే బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట హౌసింగ్ ఏఈ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

వర్మీకంపోస్టును ఆదాయ వనరుగా మార్చుకోవాలి



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

కొడవలూరు: తడి చెత్త నుంచి ఉత్పత్తి అయ్యే వర్మీ కంపోస్టును పంచాయతీలకు ఆదాయ వనరుగా మార్చుకోవాలని జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి సూచించారు. శనివారం ఆయన గౌతమ్‌నగర్‌లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్టు ఉత్పత్తిని పరిశీలించి ఎంత మోతాదులో ఉత్పత్తి చేస్తున్నారు? ఏ ధరలకు విక్రయిస్తున్నారు? తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శి షేక్ షబ్బీర్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్మీకంపోస్టు లాభదాయకమైనందున ఉత్పత్తిని కొనసాగించాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయుష్మాన్ భారత్ సర్వేపై ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. యూనిఫామ్‌తో విధులకు హాజరుకావడంతో పాటు సమయాన్ని పాటిస్తుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వం సరఫరా చేసే కోడి గుడ్లు, పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు. కోడిగుడ్లు, పౌష్టికాహారం సకాలంలో వినియోగించాలని, నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ వీ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి షేక్ షబ్బీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, తదితరులు ఉన్నారు.

రేపు ఓబీసీ మోర్చా సమావేశం



మాట్లాడుతున్న రాధాకృష్ణగౌడ్

బుచ్చిరెడ్డిపాళెం: నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఈ నెల 20న జిల్లా ఓబీసీ మోర్చా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ తెలిపారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి ఓబీసీ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు గండి రఘురామయ్య, నాయకులు పెంచల ప్రసాద్, సతీష్‌కుమార్, కృష్ణారెడ్డి, మస్తానయ్య పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణం



విశేషాలంకారంలో లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి

పొదలకూరు : శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రీవారి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం శ్యామ్‌ప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, చొప్పా వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, సన్నికంటి మురళి, తదితరులు పాల్గొన్నారు.

- అయ్యప్పనగర్‌లోని శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా దాసరి హరికృష్ణ,వనజ దంపతులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ బీ మాలకొండారెడ్డి, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



గృహలబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొడవలూరు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం లబ్ధిదారులకు సూచించారు. నాయుడుపాళెంలోని జగనన్న కాలనీని హౌసింగ్ అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. గృహ నిర్మాణాల పురోగతిని హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో నివేశన స్థలాలు పొందిన 23 మందికి గృహాలు మంజూరవగా ఇంకా నిర్మాణాలను ప్రారంభించకపోవడంతో వారిని పిలిచి మాట్లాడారు. జగనన్న కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించినందున కాలనీల్లో మౌలిక వసతులు మెరుగుపడుతాయని తెలిపారు. లేఅవుట్‌లో మట్టితోలేందుకు రూ.23 లక్షలతో ప్రతిపాదనలు పంపి ఉన్నామని చెప్పారు. త్వరలోనే మట్టితోలి చదును చేయనున్నందున నిర్మాణాలు ప్రారంభించేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఎంపీడీఓ వెంట హౌసింగ్ ఏఈ పీ సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మాగుంట గిరిధర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మనాయుడు, హౌసింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ సునీత ఉన్నారు.

క్రీడా దుస్తులు, బూట్ల పంపిణీ



క్రీడాదుస్తులు, బూట్లతో విద్యార్థులు

ఇందుకూరుపేట: గంగపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని క్రీడాకారులకు నెల్లూరు అవెన్యూ స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య క్రీడాదుస్తులు, బూట్లు శనివారం వితరణ చేశారు. ఇటీవల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కృష్ణచైతన్య రూ.36 వేల విలువైన క్రీడాదుస్తులు, బూట్లు, తదితరాలను 9 మంది విద్యార్థులకు అందజేశారు. క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయస్థాయిలో రాణించి గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు కే చలపతి మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా దుస్తులను అందజేసిన దాత కృష్ణచైతన్యను అభినందించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గోపి, వ్యాయామ ఉపాధ్యాయులు ముజీర్, దండిగుంట వంశీకృష్ణ, ఫణీంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదగూడెమ్మకు పొంగళ్లు



ముత్తుకూరు: బ్రహ్మదేవిలో గ్రామదేవత పెదగూడెమ్మ–పోతురాజు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన ఆదివారం గ్రామోత్సవం, పొంగళ్ల నివేదన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా రెండోరోజైన శనివారం విశేష పూజలు నిర్వహించినట్లు వివరించారు. ఆదివారం పెదగూడెమ్మ, పోతురాజు గ్రామోత్సవం, పొంగళ్ల నివేదనతో ఉత్సవాలు పూర్తవుతాయని తెలిపారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



ప్రత్యేక స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

ముత్తుకూరు: మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు శనివారం నుంచి ప్రత్యేక స్టడీ అవర్స్‌ను ప్రారంభించారు. పబ్లిక్ పరీక్షలపై విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు ఆరు రోజుల పాటు నిర్వహించిన ప్రీపబ్లిక్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ వరకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించనున్నట్లు బ్రహ్మదేవి హైస్కూల్ హెచ్‌ఎం సాయిప్రసాద్ తెలిపారు. ప్రతీరోజూ ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక స్టడీఅవర్స్ నిర్వహిస్తున్నామని వివరించారు.

21 నుంచి పాఠశాలల్లో రాగిజావ పంపిణీ



పాఠశాలకు చేరిన రాగి పిండి, బెల్లం పొడి ప్యాకెట్లను చూపుతున్న ఉపాధ్యాయులు

కొడవలూరు: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ నెల 21 నుంచి రాగి జావ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అవసరమైన రాగి పిండి, బెల్లం పొడిని చౌకడిపోల ద్వారా అన్నీ పాఠశాలలకు పంపిణీ చేశారు. సర్కారు బడుల్లోని విద్యార్థుల్లో పోషకాహారం లోపించకుండా మంచి పోషక విలువలున్న రాగి జావను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 1 నుంచే జగనన్న గోరుముద్దలో భాగంగా ఇవ్వాలని తొలుత నిర్ణయించినా ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి కారణంగా వాయిదా పడింది. ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో మంగళవారం నుంచి విద్యార్థులకు రాగి జావ ఇవ్వనున్నారు.

శివలింగ ప్రతిష్టకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నూతన శివలింగ ప్రతిష్టకు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన పారిశ్రామికవేత్త కొలన్ రాజారెడ్డి, పూజిత దంపతుల సహకారంతో రూ.5లక్షలతో రాతి మండపంతో పాటు శివలింగాన్ని ప్రతిష్టిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా భూమి పూజ చేయడంతో పాటు నర్మదానదీ జలాలతో శుద్ధి చేసినట్లు వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య, పాలక మండలి సభ్యులు నందకుమార్, శివకుమార్, కామేశ్వరి, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.